జనజీవనం అస్తవ్యస్తం

వర్షాలతో మారిన కాలనీలు, బస్తీల రూపురేఖలు



దూలపల్లి సర్వే నం.120లో రోడ్డుపై వరద, మురుగు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన రోడ్లపై వరదనీరు నిలవడంతో పాటు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ఉప్పొంగి మురుగు రోడ్లపై పారుతోంది. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోవడంతో ఆదివారం ఉదయమే విద్యుత్ సిబ్బంది ఆయా ప్రాంతాలకు చేరుకుని మరమ్మతులు చేపట్టారు. రంగారెడ్డినగర్ స్వామివివేకానంద విగ్రహం వద్ద రోడ్డుపై, సుచిత్ర – కుత్బుల్లాపూర్ ప్రధాన రోడ్డులోని గోదావరి హోమ్స్ నాలా వద్ద భారీగా వరదనీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు బస్తీల్లో చెట్ల కొమ్మలు ఇళ్లపై పడటంతో పైకప్పులు ధ్వంసమయ్యాయి. చంద్రశేఖర్‌రెడ్డినగర్, సూరారం తదితర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లోని పలు ఇళ్లలోకి వరదనీటితో పాటు మురుగు వచ్చి చేరింది. ఆదివారం వర్షం పడకపోవడంతో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

– కుత్బుల్లాపూర్



చంద్రశేఖర్‌రెడ్డినగర్‌లో ఓ ఇంట్లోకి చేరిన మురుగు



నందానగర్‌లో వ్యర్థాల ఆహారం కోసం గుమిగూడిన వీధి కుక్కలు

ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు



ఐడీపీఎల్-బాలానగర్ రోడ్డులోని సౌభాగ్యనగర్ వద్ద పేరుకుపోయిన చెత్త



ఆదర్శనగర్ రోడ్డులో వ్యర్థాలు

రంగారెడ్డినగర్: ఒక పక్క గత మూడు రోజులుగా వర్షాలు.. మరో పారిశుద్ధ్య నిర్వహణ లోపించడంతో ప్రజలు రోగాల బారిన ప్రమాదం పొంచి ఉంది.. ప్రతిరోజు చెత్తను తరలించాల్సిన సర్కిల్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలో ఏ ప్రధాన రోడ్డు చూసినా పేరుకుపోయిన చెత్తాచెదారాలు దర్శనమిస్తున్నాయి.. నందానగర్, ఆదర్శనగర్, ఐడీపీఎల్, గాంధీనగర్, పంచశీల కాలనీ, గురుమూర్తినగర్ బస్తీల్లో రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో దుర్వాసనలు వెదజల్లుతోంది.. దీనికి తోడు చెత్తలోని ఆహార పదార్థాల కోసం కుక్కలు వస్తుండటంతో అవి ఎక్కడ దాడి చేస్తాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో అధికారులు స్వచ్ఛతపై ఊకదంపుడు ప్రసంగాలు చేస్తుండగా వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. అసలే ఒక వైపు వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరో పక్క చెత్త వ్యర్థాలతో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా శానిటరీ అధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, చెత్త డంపింగ్ పాయింట్ల వద్ద బ్లీచింగ్ చల్లించాలని ప్రజలు కోరుతున్నారు.



సుచిత్ర- కుత్బుల్లాపూర్ ప్రధాన రోడ్డులోని గోదావరి హోమ్స్ నాలా వద్ద ఇలా..



ఐడీపీఎల్-జగద్గిరిగుట్ట రోడ్డులో రంగారెడ్డినగర్ స్వామి వివేకానంద విగ్రహం సమీపంలో చేరిన వరదనీరు



క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని వాసవీ లేఅవుట్‌లో ఆదివారం ప్రతిమ ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఈ శిబిరంలో సుమారు 100 మంది పాల్గొన్నారు. వారిని గుండె, కిడ్నీలు, కీళ్ల సంబంధిత, షుగర్, బీపీ, ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ అశోక్, దుర్గాప్రసాద్, హరీష్, అలీ తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యల పర్యవేక్షణ



6వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కృష్ణ, మున్సిపల్ సిబ్బంది

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని 6వ వార్డులో ఆదివారం కార్పొరేటర్ మార్తా వాణిప్రసాద్ పర్యటించారు. శనివారం కురిసిన భారీ వర్షంతో స్థానికంగా చెట్ల కొమ్మలు విరిగిపోవడంతో పాటు డ్రైనేజీ లైన్ల జామ్, భవనాల సెల్లార్లలో నీళ్లు చేరడంతో మున్సిపల్ సిబ్బందితో పర్యటించి ఆమె సహాయక చర్యలను పర్యవేక్షించారు.

వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ 2వ డివిజన్‌లో ఆదివారం వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలో ఎన్ఆర్ఐ కాలనీ, చందు లేఅవుట్, అపురూప లేఅవుట్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానికంగా ఆలయం అందుబాటులోకి రావడంతో చుట్టు పక్కల కాలనీల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు

సుభాష్‌నగర్: లాల్‌సాబ్‌గూడ శ్రీకోటగుట్ట పెద్దమ్మ తల్లిని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ దర్శించుకున్నారు. అనంతరం ఆయన స్థానికులు, ఆలయ కమిటీతో కలిసి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ శ్రీశైలంగౌడ్‌ను శాలువాతో సత్కరించింది. పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి మద్దెల అశోక్‌కుమార్, కోశాధికారి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, బుచ్చిరెడ్డి సభ్యులు యాదయ్య, బాల చిత్తారి, నగేష్, కృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలి



కుత్బుల్లాపూర్ చౌరస్తాలో దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుండిగల్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ వ్యవహారంపై టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం కుత్బుల్లాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేపర్ లీకేజీ కుంభకోణంతో 30 లక్షల మంది నిరుద్యోగులు తమ విలువైన సమయాన్ని కోల్పోయారని అన్నారు. అందుకు కారణమైన రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌ను వెంటనే విధుల నుంచి తప్పించాలన్నారు. ఈ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సదానందం, ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర యువజన అధ్యక్షులు ఇరుగు రాధాకృష్ణ, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలి



దళిత హక్కుల పోరాట సమితి మండల మహాసభల్లో పాల్గొన్న ఏసురత్నం

దుండిగల్: గండిమైసమ్మ చౌరస్తాలో ఆదివారం దుండిగల్– గండిమైసమ్మ మండల దళిత హక్కుల పోరాట సమితి మహాసభలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఐ నాయకులు ఏసురత్నం, ఉమామహేష్ మాట్లాడారు. బీజేపీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే హిందూ మతం పేరుతో ప్రజలకు విడగొడుతోందన్నారు.కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చడమే తప్ప దేశానికి చేసిందేమీ లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మండల అధ్యక్షుడిగా ఎల్లయ్య, కార్యదర్శిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా రాజు, రమేష్, ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రమేష్, సాయి, సలహాదారుడిగా భిక్షపతి తదితరులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు హరినాథ్, రాములు, నర్సయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శోభకృత్ నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ



శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులతో కలిసి పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్: శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన శోభకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని ఆదివారం శంభీపూర్‌లో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పంచాంగం ప్రతి ఒక్కరి జీవితాలకు, శుభాశుభ కార్యక్రమాలకు ప్రధానంగా మారిందన్నారు. శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో చక్కటి కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్, సలహాదారులు, సీనియర్ రిపోర్టర్ రమేష్ సర్వేపల్లి, ఉపాధ్యక్షులు శ్రీరామశర్మ చక్రధారి, రాంబాబు, సంయుక్త కార్యదర్శులు హరి రాఘవేంద్రశర్మ, సాయిరాం, ప్రచార కార్యదర్శులు శశికుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్‌హోల్ ధ్వంసం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని కూన మహాలక్ష్మి నగర్ ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో వాహనదారులు చూసుకోకుండా దానిపై నుంచి వెళ్లడంతో కిందపడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ బిల్లుల పరిష్కార వేదికకు స్పందన



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

చింతల్: రాజీవ్ గృహకల్పలో ఆదివారం నిర్వహించిన విద్యుత్ బిల్లుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. డీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఏడీఈ సత్యనారాయణ, ఏఏఈ రాధాకృష్ణారెడ్డి, జేఏఓ జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన పరిష్కార వేదికలో మొత్తం 68 ఫిర్యాదులు రాగా 39 వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీఈ సత్యనారాయణ మాట్లాడుతూ... విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు.

వెలుగు ఇద్దామని వెళ్లి.. అనంత లోకాలకు..



నర్సింగ్‌రావు(ఫైల్)

జగద్గిరిగుట్ట: విద్యుదాఘాతానికి గురై లైన్‌మెన్ మృతిచెందిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీకాంత్, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లమ్మబండకు చెందిన పిట్ల నర్సింగ్‌రావు(34) మూడేళ్లుగా భాగ్యనగర్ సెక్షన్ నందు లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కాగా శనివారం రాత్రి 10గంటల ప్రాంతంలో వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఎన్టీఆర్ నగర్, ఎల్లమ్మబండ వాసులు నర్సింగ్‌రావుకు ఫోన్ చేసారు. అక్కడికి చేరుకున్న లైన్‌మెన్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్యను చూస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించే లోపే ఆయన మృతి చెందాడు. నర్సింగ్‌రావుకు భార్య నవనీత, ఓ పాప, ఓ బాబు ఉన్నారు. జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దుండిగల్: విద్యుత్ మరమ్మతులు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురైన ఓ వ్యక్తి మృతి చెందాడు. మూసాపేట్ ప్రాంతానికి చెందిన వాసుదేవరావు(45)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా ఇతను విద్యుత్ లేబర్‌గా పని చేస్తుంటాడు. కాగా గండిమైసమ్మలోని ఓ కాంట్రాక్టర్ వద్ద పనికి కుదిరాడు. ఈ క్రమంలో ఆదివారం గండిమైసమ్మ చౌరస్తాలో ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ లైన్లు లాగే క్రమంలో మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ విషయంపై ఇప్పటి వరకు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: కేర్ అండ్ క్యూర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస్‌నగర్ లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. కార్పొరేటర్ జగన్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను పేద, మధ్య తరగతి వారికి ఎంతగానో ఉపయోగ పడుతాయని అన్నారు. ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన కేర్‌అండ్‌క్యూర్ ఆస్పత్రి వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ పార్టీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ డీపోచంపల్లిలోని ఇందిరనగర్‌కు చెందిన నగేష్, యాదగిరి ముదిరాజ్, శంకర్, శేఖర్ తదితరులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కొలన్ హన్మంత్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువత కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జాయింట్ సెక్రటరీ పోలీస్ జేవన్దేర్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ సింగల్ విండో చైర్మన్ బెంబిడి మల్లారెడ్డి, సిద్దనోల సంజీవరెడ్డి, సామ్మనగారి శ్రీధర్‌రెడ్డి, పండరి, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్ పెంచుకోవాలి



విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఐపీఎస్ అధికారులు

నిజాంపేట్: నిజాంపేట్‌లోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ డైరెక్టర్, ఐపీఎస్ అధికారి సునీల్ ఇమ్మానుయేల్, విశిష్ట అతిథిగా బ్రాడ్రిడ్జ్ సంస్థ మానవ వనరుల ఎగ్జిక్యూటీవ్ వైస్‌ప్రెసిడెంట్ అంకిత్ అరోరాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మొమెంటోలను అందజేశారు. అనంతరం అంకిత్ అరోరా మాట్లాడుతూ.... విద్యార్థులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తమ స్కిల్ సెట్‌ను పెంపొందించుకోవాలని అన్నారు. సునీల్ మాట్లాడుతూ... విద్యార్థులు గొప్ప గోల్స్ ఏర్పర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకుని దేశ ఉన్నతికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జంధ్యాల నారాయణమూర్తి, ప్రిన్సిపాల్ ప్రవీణ్ జ్యుగ్గే, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ తాన్య పాల్గొన్నారు.

ఆలయ, కమ్యూనిటీహాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి



మేయర్ నీలారెడ్డిని కలిసిన బంజారా సేవా సంఘం సభ్యులు

నిజాంపేట్: బంజారాల ఆరాధ్య దైవం శ్రీసేవాలాల్ మహరాజ్ ఆలయం, కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ బంజారా సేవా సంఘం సభ్యులు మేయర్ కొలన్ నీలారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె కార్పొరేషన్ పరిధిలో స్థలం కేటాయించడంతో పాటు నిధులు విడుదల చేసి భవన నిర్మాణాలకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం ఉపాధ్యక్షులు రాంచంద్ర నాయక్, రవీందర్ నాయక్, కోశాధికారి పాండునాయక్, రవినాయక్, సంఘ సభ్యులు గోపాల్‌నాయక్, బాలాజీనాయక్, పాండునాయక్, బాలాజీ, రవినాయక్, సంతోష్‌నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐడీపీఎల్ వాసులను ఖాళీ చేయమనడం సరికాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్. చిత్రంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం వ్యాపార దృక్పథంతో ఆలోచిస్తూ ఐడీపీఎల్ కాలనీ వాసులను ఇళ్లను ఖాళీ చేయమనడం సరికాదని ఎమ్మెల్యేలు వివేకానంద్, మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఐడీపీఎల్ కాలనీలోని కమిటీహాలులో కాలనీవాసుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యేలు హాజరై మాట్లాడారు. 2003లో వీఆర్ఎస్ తీసుకున్న 150 కుటుంబాల నుంచి రూ.2లక్షల వరకు డిపాజిట్ తీసుకుని ఐడీపీఎల్ కాలనీలో ఉండేందుకు అంగీకరించిన యాజమాన్యం ఇప్పుడు ఆకస్మాత్తుగా ఖాళీ చేయమనడం సబబు కాదన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలు ఉన్నపలంగా ఎక్కడికి వెళ్తారని ప్రశ్నించారు. వీఆర్ఎస్‌తో 15 ఏళ్ల సర్వీసును కోల్పోయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయం చూపి ఆపై ఇళ్లను ఖాళీ చేయించాలన్నారు. కాలనీవాసులకు మద్దతుగా దేశ రాజధాని ఢిల్లీకి ఐడీపీఎల్ యాజమాన్యంతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఐడీపీఎల్‌కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రగతియాత్రలో భాగంగా ఆదివారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని చెరుకుపల్లి కాలనీ, కల్పన సొసైటీ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టి సమస్యలు తెలుసుకున్నారు. చెరుకుపల్లి కాలనీ ప్రధాన రోడ్డుపై వరదనీరు నిలుస్తోందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గౌరీష్, బీఆర్ఎస్ నాయకులు, సర్కిల్ అధికారులు పాల్గొన్నారు.

◆ జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్‌పురి కాలనీలో కాలనీవాసుల సౌజన్యంతో నూతనంగా నిర్మించిన ఆర్చ్‌ను ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నవోదయ సంక్షేమ సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐడీపీఎల్ యాజమాన్య నోటీసులకు భయపడొద్దు

బీజేపీ నేత మల్లారెడ్డి



చింతల్: ఐడీపీఎల్ యాజమాన్యం ఇచ్చిన నోటీసులకు భయపడొద్దని.. మరో సంవత్సరం పాటు కాలనీలో ఉండేందుకు అనుమతి కోరామని వాహెచ్‌ఏఎల్ మాజీ డైరెక్టర్, బీజేపీ నేత మల్లారెడ్డి అన్నారు. ఐడీపీఎల్ కాలనీ నివాసితులకు ఇళ్లను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఆదివారం కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో సమావేశం జరిగింది. దీనికి హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ... ఐడీపీఎల్ కాలనీ వాసులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవ్య, భగవంత్ ఖూబా, కిషన్‌రెడ్డిల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లామని గుర్తు చేశారు. ఐడీపీఎల్ ఫ్యాక్టరీకి చెందిన వందల ఎకరాల భూమి కబ్జాకు గురైందన్నారు. అయితే ఐడీపీఎల్ కాలనీవాసులు ఎన్నో ఏళ్లుగా కాలనీకి చెందిన ప్రభుత్వ భూమికి రక్షణగా ఉంటూ వస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఐడీపీఎల్ కాలనీవాసులకు ప్రత్యామ్నాయం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేందర్, స్థానికులు బాలయ్య, విఠల్‌రెడ్డి, కన్నన్, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.